క్లుప్తంగా

ప్రగడ కోటయ్యకు ఘననివాళి



తాడేపల్లి రూరల్: ప్రముఖ జాతీయ ఉద్యమ నాయకుడు, చేనేత పరిశ్రమ పరిరక్షణ కోసం పోరాటం చేసిన యోధుడు ప్రగడ కోటయ్య జయంతి వేడుకలను ఆత్మకూరులోని వైఎస్సార్‌సీపీ మంగళగిరి నియోజకవర్గ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, పార్టీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డిలు విచ్చేసి ప్రగడ కోటయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రగడ కోటయ్య జీవితం మొత్తం చేనేత పరిశ్రమ కోసం, చేనేతల కోసం ఎంతో శ్రమించారని పేర్కొన్నారు. దేశంలో వ్యవసాయ రంగం తరువాత అంత పెద్ద స్థాయిలో ఆధారపడి జీవనం సాగిస్తున్న రంగం చేనేత రంగం అని, చేనేత శ్రామికులు కొన్ని ఫలాలు అనుభవిస్తున్నారంటే అది కోటయ్య కృషి, పోరాటం అని అన్నారు. పార్టీ మంగళగిరి పట్టణ అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు ఆకురాతి రాజేష్, గుంటూరు జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు ఊట్లపాల శ్రీనివాసరావు, రాష్ట్ర చేనేత విభాగం ప్రధాన కార్యదర్శి గంజి షణ్ముక్, మంగళగిరి నియోజకవర్గం అధ్యక్షుడు సయ్యద్ గౌస్ మొహిద్దీన్, మంగళగిరి మండల ఉపాధ్యక్షులు షేక్ గౌస్, మంగళగిరి మండల ప్రధాన కార్యదర్శి చిన్నారి యాదవ్, నియోజకవర్గ ఇంటలెక్చువల్ విభాగం అధ్యక్షుడు జంగా నాగిరెడ్డి, సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడు భీమిరెడ్డి శరన్ కుమార్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందజేత

తాడేపల్లి రూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని కాజా టోల్‌గేట్ వద్ద ఎస్‌కేసీవీ చిల్డ్రన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆమోదిని గర్ల్స్ హోంలోని చిన్నారులకు శంకర్ షాలిని ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఫౌండేషన్ ఉపాధ్యక్షురాలు భూక్యా షాలిని మాట్లాడుతు గిరిజన ప్రజా సమాఖ్య వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు, రాష్ట్ర ఎస్టీ కమిషన్ మాజీ సభ్యులు వడిత్య శంకర్ నాయక్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నిత్యావసర సరకులను అందజేశామని తెలిపారు. సమాఖ్య నాయకులు పి.దుర్గా నాయక్, బొక్క అగస్టీన్, గోపిచందు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షోభ గృహాలు

అధ్వానంగా సంక్షేమ వసతి గృహాలు

ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు సంక్షోభ కేంద్రాలుగా మారాయి.. మరుగుదొడ్లు అధ్వానం.. పారిశుద్ధ్యం హీనం.. భోజనం దారుణం.. మోనూ మాయం.. పర్యవేక్షణ శూన్యం. టూకీగా మంగళగిరి, తాడికొండల్లోని హాస్టళ్లలో ఇదీ దుస్థితి. వైఎస్సార్ సీపీ హయాంలో హాస్టళ్లలో వసతుల కల్పనకు పెద్దపీట వేసి, విద్యార్థుల వెతలు తీర్చగా.. వారు హాయిగా చదువుపై దృష్టి పెట్టి.. ఉన్నతంగా రాణించారు. నేడు కూటమి ప్రభుత్వంలో వసతి గృహాలు కనీస వసతులు లేక కునారిల్లుతుండగా.. విద్యార్థులు కడుపునిండా భోజనం లేక.. అధ్వాన పరిస్థితుల్లో కాలకృత్యాలు కూడా తీర్చుకోలేక.. ఎవరికీ చెప్పుకోలేక నరకయాతన పడుతున్నారు.

SAKSHI సాక్షి గ్రౌండ్ రిపోర్టు GROUND REPORT

- నరిపడా గదులు లేక ఇబ్బందులు
- మరుగుదొడ్లు అధ్వానం..
- పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తా చెదారం
- మెనూ మాయం.. పర్యవేక్షణ శూన్యం
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం

మంగళగిరి టౌన్: చాలీచాలని గదులు, రుచిలేని భోజనాలు, శుభ్రత లేని పరిసరాలు, వెరసి సంక్షేమ వసతి గృహాలు సం'క్షోభ' నిలయాలుగా మారాయి. విద్యార్థులకు అన్ని రకాలుగా వసతులు కల్పించాల్సిన హాస్టళ్లు హడలెత్తిస్తున్నాయి. పర్యవేక్షణ కరువై విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. పేద విద్యార్థులపై కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. వసతి గృహాల్లో వున్న విద్యార్థులు సతమతం అవుతున్నారు. సరిపడా గదులు లేకపోవడంతో విద్యార్థులు ఎంతో ఇబ్బందులు పడుతున్నారు.

- మంగళగిరి నగర పరిధిలో 5 ప్రభుత్వ హాస్టళ్లు ఉన్నాయి. నగర పరిధిలోని కొప్పురావు కాలనీ వద్ద ఎస్సీ బాలుర హాస్టల్‌లో 15 మంది విద్యార్థులు ఉన్నారు. ఆ హాస్టల్‌లో మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. కనీసం మరుగుదొడ్లను శుభ్రం చేసే వారే కరువయ్యారు. దీంతో విద్యార్థులు మరుగుదొడ్డికి వెళ్లాలంటేనే భయపడుతున్నారు.



ఎస్సీ బాలికల వసతి గృహం నిర్మాణంలో ఉండడంతో ఇరుకు గదుల్లో ఉంటున్న విద్యార్థినులు

- నగర పరిధిలోని గౌతమ బుద్ధరోడ్‌లో ఆర్‌అండ్‌బీ బంగ్లా సమీపంలో ఉన్న ప్రభుత్వ బీసీ బాలుర హాస్టల్‌లో బాత్‌రూమ్‌లు అధ్వానంగా ఉన్నాయి. హాస్టల్‌లో పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉండడంతో విద్యార్థులు తరచూ అనారోగ్యానికి గురవుతున్నట్లు సమాచారం. హాస్టల్ పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉండడంతో బాత్‌రూమ్‌లు సరిగా లేకపోవడంతో విద్యార్థులు తమ బాధను ఎవరికి చెప్పుకోవాలో తెలియక సతమతమవుతున్నారు. ఈ హాస్టల్ భవనం పాతది అవటంతో సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు.



అపరిశుభ్రంగా ఉన్న బీసీ బాలుర హాస్టల్ ఆవరణ

సమస్యల అడ్డాగా ఎస్సీ బాలికల హాస్టల్

నగర పరిధిలోని ఇందిరానగర్‌లో వున్న ఎస్సీ బాలికల హాస్టల్‌లో పాఠశాల, కళాశాల విద్యార్థినులు ఉంటున్నారు. గతంలో ఇక్కడ వున్న హాస్టల్ శిథిలావస్థకు చేరుకోవడంతో దాన్ని పడవేసి కొత్త హాస్టల్‌ను నిర్మించడానికి ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. దీంతో ఆ హాస్టల్ ఎదురుగానే ఉన్న ఓ ప్రభుత్వ భవనంలోకి వీరందరినీ తరలించారు. పాఠశాలకు సంబంధించిన విద్యార్థినులు మొత్తం 78 మంది ఉండగా వారికి మూడు గదులు కేటాయించారు. గదులు వారికి సరపడక ఇబ్బందులు పడుతూ అక్కడే ఉంటున్నారు. కళాశాల విద్యార్థినులు 30 మందికి పైగా ఉన్నారు. మొత్తం ఈ హాస్టల్‌లో 100కు పైగా విద్యార్థినులు ఉన్నారు. వీరందరికీ కలిపి టాయిలెట్లు, బాత్‌రూమ్‌లు 8 మాత్రమే ఉండడంతో బాలికలు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం లేవగానే ఎవరికి వారు పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే క్రమంలో అరకొరగా ఉన్న టాయిలెట్లు, బాత్‌రూమ్‌లను ఉపయోగించుకుంటున్నారు. పాఠశాల విద్యార్థులకు బెడ్‌షీట్ మాత్రమే ఇచ్చి ప్రభుత్వం సరిపెట్టుకుంది. వారు ఇంటి దగ్గర నుంచి చాప తెచ్చుకుని దాని మీద బెట్‌షీట్ వేసుకుని పడుకుంటున్నారు.

సదుపాయాల కల్పనలో విఫలం

విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు పూర్తయినా కూటమి ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్లలో సౌకర్యాలపై దృష్టి సారించలేదు. అన్ని హాస్టళ్లలో మరుగుదొడ్లు, మూత్రశాలలను శుభ్రపరిచేందుకు సిబ్బంది లేకపోవడంతో విద్యార్థులు అలాగే వినియోగించుకుంటున్నారు. సంబంధిత శాఖల ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి సమస్యలు పరిష్కరించడంలో విఫలమవుతున్నారనేది బహిరంగ రహస్యమే.

మోనూ ఏదీ?

సంక్షేమ వసతి గృహాలపై పర్యవేక్షణ అంతంత మాత్రంగానే ఉంది. దీంతో మెనూ సక్రమంగా అమలు కావడం లేదని విమర్శలు ఉన్నాయి. వారానికి మూడు పర్యాయాలు చికెన్, ఆరు రోజులు అరటిపండ్లు, కోడిగుడ్లు ఇవ్వాలని నిబంధన ఉన్నా వసతి గృహ సంక్షేమ అధికారులు వాటిని పాటించడం లేదని తెలుస్తోంది. హాస్టళ్లను తనిఖీ చేయాల్సిన సహాయ సంక్షేమ అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.



బీసీ బాలుర హాస్టల్‌లో అధ్వానంగా స్నానపు గది

వసతి గృహాల్లో సమస్యల తిష్ట

తాడికొండ: సంక్షేమ వసతి గృహాల్లో సమస్యలు తిష్ట వేయడంతో అరకొర వసతులతో చదువుల కోసం విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారు. సకల వసతులు కల్పించి పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేయాల్సిన ప్రభుత్వం వసతి గృహాల్లో సమస్యలు గాలికొదిలేయడంతో నానా ఇబ్బందులు పడాల్సిన దుస్థితి ఏర్పడింది. తాడికొండలోని సాంఘిక సంక్షేమ వసతి గృహంలో చినుకు పడితే ఆవరణ చిన్నపాటి చెరువుగా మారి పాములు సంచరించే దుస్థితికి చేరింది. పాఠశాలకు వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న లో లెవల్ చప్టాపై నుంచి వరద నీరు భారీగా పారుదల అవుతుండటంతో మోకాళ్లలోతు నీళ్లలో ఉపాధ్యాయులు వెళ్లాల్సిన దుస్థితిపై పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీసీ బాలికల వసతి గృహానికి వెళ్లే రోడ్డు కూడా చినుకు పడితే బురదమయంగా అధ్వానంగా మారడంతో చిన్నారులు జారిపడి బురదలో పడుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో చిన్నారులకు మంచాలు లేని దుస్థితి

- అదేవిధంగా బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో మంచాలు లేకపోవడంతో చిన్నారులు ఇంటివద్ద నుంచి తెచ్చుకున్న దుప్పట్లు పరుచుకొని పడుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. యధా రాజ తథా ప్రజా అన్న చందంగా సాక్షాత్తు మంత్రి నారా లోకేష్ చేపడుతున్న విద్యాశాఖ ఆయన నివాసానికి కూతవేటు దూరంలో ఉన్న ఇక్కడే పరిస్థితి ఇంత అధ్వానంగా ఉంటే ఇక రాష్ట్రంలో దుస్థితిపై ప్రత్యేకంగా చెప్పనవసరం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ప్రభుత్వం అందజేసిన బ్యాగులు చినిగిపోవడంతో కుట్టుకున్న విద్యార్థులు



చిన్న వర్షానికే చెరువులా మారిన తాడికొండ బీఆర్ అంబేడ్కర్ గురుకులం ఆవరణ

- కేఎల్‌యూలో అ'పూర్వ' సమ్మేళనం



తాడేపల్లి రూరల్: వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీలో శనివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు మాట్లాడుతూ తమ విశ్వవిద్యాలయంలో పూర్వ విద్యార్థుల దశాబ్ద కలయిక-2015 బ్యాచ్ కార్యక్రమం నిర్వహించామని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న పూర్వ విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారని తెలిపారు. కార్యక్రమ కన్వీనర్ డాక్టర్ శ్రీకావ్య మాట్లాడుతూ యూనివర్శిటీలో కృత్రిమ మేధస్సు ఆధారిత అభివృద్ధి పనులు ఎలా జరుగుతున్నాయో పూర్వ విద్యార్థులకు వివరించామన్నారు. పూర్వ విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కో-కన్వీనర్ డాక్టర్ కె.సోని తదితరులు పాల్గొన్నారు.

- గర్భిణులకు పోషకాహారం అందజేత



తాడేపల్లి రూరల్: రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ఆధ్వర్యంలో మంగళగిరిలోని ఇందిరానగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న గర్భిణులకు ప్రోటీన్ సప్లిమెంట్లు, తాజా పండ్లను శనివారం అందజేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.విజయలక్ష్మి మాట్లాడుతూ గర్భధారణ సమయంలో ప్రోటీన్ సప్లిమెంట్లు, తాజా పండ్లు తీసుకోవడం వలన తల్లి, బిడ్డ ఇద్దరికీ ప్రయోజనం ఉంటుందని, ప్రోటీన్ సప్లిమెంట్లు శిశువు పెరుగుదలకు, కండరాల అభివృద్ధికి, బరువు పెరగడానికి సహాయపడతాయని తెలిపారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు ప్రగడ రాజశేఖర్, చీరాల రోటరీ క్లబ్ రీజనల్ చైర్, సర్వీస్ ప్రాజెక్ట్ అధ్యక్షులు కరణం శ్రీనివాసబాబు, యూపీహెచ్‌సీ డాక్టర్ పి.అనూష, మంగళగిరి రోటరీ క్లబ్ కార్యదర్శి పారేపల్లి నిరంజన్ గుప్తా, క్లబ్ చార్టర్డ్ ప్రెసిడెంట్ అనిల్ చక్రవర్తి, కోశాధికారి కేవీఎస్ ప్రకాశరావు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

- సమస్యల పరిష్కారానికి కృషి

తాడేపల్లి రూరల్: బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి పాటుపడే ఏకైక పార్టీ సీపీఐ అని ఆ పార్టీ నాయకులు స్పష్టం చేశారు. మంగళగిరి పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు. పార్టీ మంగళగిరి నియోజకవర్గ 24వ మహాసభ ఘనంగా జరిగిందని తెలిపారు. నియోజకవర్గ కార్యదర్శిగా చిన్ని తిరుపతయ్య, సహాయ కార్యదర్శులుగా యార్లగడ్డ వెంకటేశ్వరరావు, కంచర్ల కాశయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

- ఇళ్ల నిర్మాణానికి ఆర్థికసాయం

తాడేపల్లి రూరల్: ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద ఇంటి నిర్మాణానికి రూ. 2.50 లక్షలు మంజూరు చేయబడుతుందని, లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా కోరారు. శనివారం నగరపాలక సంస్థలోని ఆయన కార్యాలయంలో కమిషనర్ అలీమ్ బాషా మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకునే ఆర్థిక స్తోమత లేని పేదలు సంబంధిత సచివాలయాల్లో కానీ, నగరపాలక సంస్థ కార్యాలయంలో కానీ సంప్రదించాలని సూచించారు.

సంక్షిప్త వార్తలు

- 'పీఎం సూర్యఘర్'పై ఉచిత శిక్షణ

తాడేపల్లి రూరల్: ప్రధానమంత్రి సూర్యఘర్ యోజనపై మంగళగిరిలోని వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాలలో 9 రోజుల పాటు ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కళాశాల నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 30వ తేదీ నుంచి ప్రారంభమయ్యే శిక్షణలో 18 సం''ల నుండి 50 సం''లోపు నిరుద్యోగులు శిక్షణ పొందవచ్చని, శిక్షణ పూర్తయిన వారికి సోలార్ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని, రిజిస్ట్రేషన్ మరియు ఇతర వివరాలకు 9705618919 నెంబరులో సంప్రదించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

- ప్రకృతి వ్యవసాయంతో మేలు



ఫిరంగిపురం: ప్రకృతి వ్యవసాయం ద్వారా భూమిలో కర్బన శాతం పెరుగుతుందని జిల్లా వనరుల కేంద్రం అధికారి ఎం.రాజవంశీ అన్నారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో మేడికొండూరు, ఫిరంగిపురం మండలాల వీఏఏలు, వీహెచ్ఏలకు రెండురోజులుగా ప్రకృతి వ్యవసాయంపై నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో రాజవంశీ పాల్గొని పలు సూచనలు చేశారు. శిక్షకురాలు ఉమాదేవి, ఏఓ వాసంతి, సిబ్బంది చింతా వరప్రసాద్, ఇర్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

- క్రమశిక్షణతోనే ఉన్నత స్థానాలకు..



ఫిరంగిపురం: విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడం ద్వారా వారు ఉన్నతస్థానాలు అధిరోహిస్తారని కరస్పాండెంట్ ఫాదర్ మాలపాటి ఫాతిమా మర్రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని సెయింట్‌పాల్స్ పాఠశాలలో పూర్వ కరస్పాండెంట్ ఫాదర్ ఏరువ ఇన్నయ్య మెమోరియల్ మెరిటోరియస్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం శనివారం(1977-1984)కు చెందిన పూర్వవిద్యార్థులు నిర్వహించారు. ఫాతిమా మర్రెడ్డి మాట్లాడుతూ ఫాదర్ ఇన్నయ్య పాఠశాల కరస్పాండెంట్‌గాను సెయింట్ ఇగ్నేషియస్ బోర్డింగ్ రెక్టార్‌గా సేవలందించారని చెప్పారు. పూర్వవిద్యార్థి రిటైడ్ ఐఆర్ఎస్ అధికారి కె.హనుంబాబు మాట్లాడారు. అనంతరం ఇటీవల పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులు ఎస్.జోసఫ్‌కుమార్, జి.జగదీష్, జె.శోమేశ్వరరావు, ముజావర్ అలీ, షేక్ షారుఖ్ షకూర్, టి.జ్యోతిరాజులకు ఒక్కొక్కరికి రూ.10వేలు, ప్రశంసాపత్రం, జ్ఞాపికలను అందజేశారు. హెచ్ఎం పామిశెట్టి శౌరిరాజు, పూర్వవిద్యార్థులు పి.రాజారెడ్డి, చిట్టా వీరారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- ముగిసిన శిక్షణా తరగతులు

దుగ్గిరాల: దుగ్గిరాల మండల సమావేశ మందిరంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై ఏర్పాటు చేసిన మూడు రోజులు శిక్షణా తరగతులు శనివారం ముగిశాయి. దుగ్గిరాల మండల ఏఓ ఆర్.విజయబాబు, తెనాలి ఏడీఏ కె.రాజకుమారి, రైతుసేవా కేంద్రాల సిబ్బంది, పాల్గొన్నారు.

- ఎస్పీ చేతులమీదుగా ప్రశంసాపత్రం



తాడేపల్లి రూరల్: మంగళగిరి రూరల్ సబ్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్ వెంకట్ శనివారం గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. 2024 జూలైలో ఛార్జ్ తీసుకున్న వెంకట్ లోక్ అదాలత్‌లో అత్యధికంగా 154 కేసులు రాజీ చేయించడమే కాకుండా, గంజాయి బ్యాచ్‌లను అరెస్ట్ చేసి, రూరల్ ప్రాంతాల్లో నేరాల రేటు గణనీయంగా తగ్గించడంలో ప్రముఖ పాత్ర పోషించడంతో ప్రశంసాపత్రం దక్కింది. ఎస్ఐ వెంకట్‌ను డీఎస్పీ మురళీకృష్ణ, రూరల్ సీఐ శ్రీనివాసరావులు అభినందించారు.

- మేడికొండూరు తహసీల్దార్ బాధ్యతలు స్వీకరణ



మేడికొండూరు: మేడికొండూరు మండల నూతన తహసీల్దార్‌గా జి.రాఘవరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర సచివాలయంలోని ఈడబ్ల్యూఎస్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తూ ఆయన ఇక్కడకు డెప్యూటేషన్‌పై వచ్చారు. రాఘవరావు మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరిస్తానని వెల్లడించారు.

- నేడు ఉచిత మెగా వైద్యశిబిరం

దుగ్గిరాల: మానవ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు వంగర సురేష్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెదకొండూరు గ్రామంలోని కనకపుట్లమ్మతల్లి దేవస్థానం ఆవరణలోని ఫంక్షన్ హాల్‌లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు శిబిరం జరుగుతుందని తెలిపారు.

- పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ

మేడికొండూరు: మండల పరిధిలోని భీమినేనివారిపాలెం గ్రామంలో పాల ఉత్పత్తిదారులకు రెంటపాళ్ల బీఎంసీ మేనేజర్ టి.గోపి ఆధ్వర్యంలో శనివారం బోనస్‌లు పంపిణీ చేశారు. 2024-25 సంవత్సరాని గాను మొత్తం 45 మంది పాడి రైతులకు రూ. 2,76,623 లను బోనస్ గా పంపిణీ చేశారు. సూపర్‌వైజర్ ఎం.నవీన్, పాల ఉత్పత్తి దారుల సంఘం అధ్యక్షుడు గంగా శ్రీనివాస్, వేతన కార్యదర్శి దండ కోటేశ్వరరావు, పాడి రైతులు పాల్గొన్నారు.

- రేషన్ పంపిణీ ప్రారంభం

తెనాలిరూరల్: వృద్ధులకు ప్రతినెల ముందుగానే రేషన్ పంపిణీ చేయాలన్న ప్రభుత్వ నిబంధనల ప్రకారం శనివారం రేషన్ పంపిణీని పట్టణంలో తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ ప్రారంభించారు. వాస్తవానికి ప్రతినెల 1వ తేదీ నుంచి రేషన్ డీలర్ల వద్ద రేషన్ పంపిణీ జరుగుతుంది. అయితే షాపుకు వచ్చి రేషన్ తీసుకెళ్లలేని వృద్ధులు, వికలాంగులు, వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి నాలుగు రోజులు ముందుగానే రేషన్ పంపిణీకి శ్రీకారం చుట్టారు. వృద్ధులతో మాట్లాడి రేషన్ సరఫరాలో ఇబ్బందులు తెలుసుకున్నారు. నెలాఖరులోగా పంపిణీ పూర్తి చేస్తామని తహసీల్దార్ తెలిపారు.

నివేశన స్థలాల పునఃపరిశీలన

తెనాలిరూరల్: పేదలకు కేటాయించిన నివేశన స్థలాల పునః పరిశీలన కార్యక్రమం రూరల్ గ్రామం పెదరావూరులో శనివారం జరిగింది. గత ప్రభుత్వంలో పేదలకు నివేశన స్థలాలు కేటాయించేందుకు పెద్ద ఎత్తున భూసేకరణ చేసి, జగనన్న కాలనీల పేరట నివేశన స్థలాలు కేటాయించిన సంగతి తెలిసిందే. లబ్ధిదారుల ఎంపిక, నివేశన స్థలాల కేటాయింపు పారదర్శకంగా జరిగిందా? లేదా? అన్న విషయాలను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది స్థలాలను పరిశీలిస్తున్నారు.